స్నాతకోత్సవంలో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి అశ్విన్ వైష్ణవ్

2027 వరకు సరికొత్త టెక్నాలజీతో బుల్లెట్ ట్రైన్లు

- దేశవ్యాప్తంగా 90వేలకు పైగా టెలికాం టవర్లు
- కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో 2027 వరకు ఊహించని విధంగా సరికొత్త టెక్నాలజీతో బుల్లెట్ ట్రైన్లు పట్టాలు ఎక్కనున్నట్టు కేంద్ర రైల్వే, కమ్యూనికేషన్, ఎలక్ట్రానిక్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. టెలికాం రంగంలో దేశం అగ్రగామిగా నిలిచేలా దేశవ్యాప్తంగా 90 వేలకుపైగా టెలికాం టవర్లు ఏర్పాటు చేశామన్నారు. సంగారెడ్డి జిల్లా కంది మండల కేంద్రంలోని ఐఐటి హైదరాబాద్‌లో శనివారం 14వ స్నాతకోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. రైల్వే శాఖకు సంబంధించి ప్రస్తుతం దేశ వ్యాప్తంగా 1300 పురాతన రైల్వే స్టేషన్లను కూల్చేసి వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నామన్నారు. అందులో సికింద్రాబాద్, చర్లపల్లి స్టేషన్ ఉన్నాయన్నారు. 2047నాటికి ప్రపంచ పటంలో భారత్ ఒక కొత్త మార్పుతో అగ్రగామిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనికి ప్రతి విద్యార్థీ తమ వంతు కృషి చేయాలని కోరారు. అనంతరం ఐఐటీ హైదరాబాదులో విద్యాభ్యాసం పూర్తి చేసిన 1250 మంది వివిధ శాఖల విద్యార్థులకు గ్రాడ్యుయేట్ పట్టాలు అందించారు. బీటెక్ సిఎస్‌సిలో విద్యార్థి రాహుల్ రామచంద్రన్‌కు బంగారు పతకం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, మెదక్ ఎంపి రఘునందన్‌రావు, ఐఐటి బోర్డ్ ఆఫ్ గవర్నర్ బివి.మోహన్‌రెడ్డి, డైరెక్టర్ బిఎస్.మూర్తి, విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌లో బోనాల ఉత్సవాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో శనివారం బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆషాఢ మాసం బోనాల వేడుకల్లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ప్రథమ మహిళ సుధా దేవ్ వర్మ పాల్గొన్నారు. దేశాభివృద్ధి, తెలంగాణ ప్రజల శ్రేయస్సు కోసం మహంకాళి దేవికి గవర్నర్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలకు ఈ సందర్భంగా గవర్నర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో గవర్నర్ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిషోర్, ఇతర సీనియర్ అధికారులు, రాజ్ భవన్ ఉద్యోగులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో రెండో రోజూ వర్షం

- రోడ్లపై భారీగా వరద
- విద్యుత్ సరఫరాకు అంతరాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం కూడా భారీ నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఎల్బీనగర్, నాగోల్, ఉప్పల్, ఉస్మానియా యూనివర్సిటీ, విద్యానగర్, నల్లకుంట ప్రాంతాల్లో ఉరుములతో కూడిన వాన పడింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, మారెడుపల్లి, చిలకలగూడ ప్రాంతంలోనూ వర్షం కురిసింది. ఉప్పల్, రామంతపూర్, తార్నాక, సీతాఫల్‌మండి, చిలకలగూడ, సికింద్రాబాద్, మారేడుపల్లి, బోయిన్‌పల్లి, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, ఫిలింనగర్‌లో కుండపోత వర్షం కురిసింది. రోడ్లపై వరద నీరు చేరడంతో విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జవహర్‌నగర్‌లో భారీ వరద ప్రవహించింది. శ్రీ వెంకటేశ్వర కాలనీని వరద నీరు ముంచెత్తింది. ప్రజలు ఇండ్ల నుంచి బయటికి రాలేక ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. నివాసాలకే పరిమితం కావాలని, అత్యవసరమైతేనే బయటకు రావాలని సూచించారు.

పట్టించుకోని ఎస్పీడీసీఎల్

రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు గ్రేటర్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. దీంతో నగరవాసులు టీజీ ఎస్పీడీసీఎల్ అధికారులకు ఫోన్‌లైన్‌లో సంప్రదించగా.. ఎవరూ అందుబాటులోకి రావడం లేదు. కొన్ని ఫోన్ నెంబర్లు స్విచ్ఛాఫ్ వస్తుండగా.. మరికొన్ని నెంబర్లకు ఫోన్ చేస్తే కాల్ ఎత్తడం లేదు. దీంతో ఆయా కాలనీల వాసులు విద్యుత్ అంతరాయంతో ఇబ్బందులు పడుతున్నారు.

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్‌దే విజయం

- పిసిసి అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గానికి త్వరలో జరగనున్న ఉప ఎన్నికలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తారని తెలిపారు. రాష్ట్రంలో ఏ ఎన్నిక వచ్చినా బీఆర్‌ఎస్ పార్టీకి ఉనికి ఉండబోదని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో జూబ్లీహిల్స్ నుంచి గతంలో పోటీ చేసిన మురళిగౌడ్, మాజీ కార్పొరేటర్ సంజయ్‌కుమార్‌గౌడ్‌తోపాటు పలువురు మహేశ్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంపై కేసీఆర్, కేటీఆర్, కవిత దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. బనకచర్ల విషయంలో మాజీ మంత్రి హరీశ్‌రావు పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో ఉంచేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల ఆకాంక్షలమేరకే ప్రజాపాలన కొనసాగుతున్నదని తెలిపారు. అందుకే ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరుతున్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితులైన చాలా మంది నేతలు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారని తెలిపారు.

కాలుష్య పరిశ్రమలను ఓఆర్ఆర్ వెలుపలికి తరలించాలి

- కమర్షియల్ ట్యాక్స్, రిజిస్ట్రేషన్, మైన్స్ ఆదాయం పెరగాలి
- క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాలుష్యకారక పరిశ్రమలన్నిటిని ఔటర్ రింగ్ రోడ్డు వెలుపలికి తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్. అంబేద్కర్ సచివాలయంలో క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులైన మంత్రులు ఉత్తంకుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావులతో కలిసి ఆదాయ వనరుల సమీకరణపై సమీక్ష నిర్వహించారు. పరిశ్రమల తరలింపునకు సంబంధించి విధి విధానాలతో క్యాలెండర్ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రాజీవ్ స్వగృహ పథకం కింద వివిధ దశల్లో ఉన్న ఇండ్లు, హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో ఉన్న ఖాళీ స్థలాల విక్రయాలపై సమావేశంలో చర్చించారు. హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో జరిగే బహిరంగ వేలం ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సబ్ కమిటీ సభ్యులు సూచించారు. సామాన్యులు, మధ్య తరగతి వర్గాలకు ఇండ్లు అందుబాటులో ఉండేలా హౌసింగ్ బోర్డు అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. నెల రోజుల వ్యవధిలో ఆదాయాల పెరుగుదలపై వివిధ శాఖల అధికారులు సమావేశంలో నివేదిక సమర్పించారు. కమర్షియల్ ట్యాక్స్ శాఖలో 1.8, రిజిస్ట్రేషన్ శాఖలో 3.6, గనుల శాఖలో 7శాతం ఆదాయం పెరుగుదల ఉన్నట్టు అధికారులు మంత్రులకు నివేదించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రదీప్ కుమార్ సుల్తానియా, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, మెట్రోపాలిటన్ ఏరియా నగర అభివృద్ధి శాఖ సెక్రటరీ ఇలంబర్తి, హెచ్‌ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్, గనుల శాఖ కమిషనర్ శశాంక, కలెక్టర్లు హరిచందన, నారాయణరెడ్డి, వల్లూరు క్రాంతి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టి

గిరిజన ఆశ్రమ పాఠశాలలో అమానుషం..

- అల్పాహారం కిచిడీలో పురుగులు
- తినలేక ఆకలితోనే తరగతులకు హాజరైన విద్యార్థినులు
- విచారణకు ఆదేశించిన పిఒ
- బాధ్యులను వెంటనే సస్పెండ్ చేయాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐటిడిఎకి కూత దూరంలో పట్టణానికి నడిబొడ్డున ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అమానుష ఘటన జరిగింది. విద్యార్థినులకు అల్పాహారంగా అందించే కిచిడీలో పురుగులు ప్రత్యక్షం అయ్యాయి. దాంతో 600 మంది విద్యార్థినులు ఆకలితోనే క్లాసులకు హాజరయ్యారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో శనివారం జరిగింది. ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలం పట్టణంలో గిరిజన ఆశ్రమ పాఠశాల ఉంది. అక్కడ సుమారు 650 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు. మూడ్రోజుల నుంచి అన్నంలో పురుగులు వస్తున్నాయని ప్రధానోపాధ్యాయురాలు, వార్డెన్‌కి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. శనివారం అల్పాహారంగా అందించేందుకు 80 కేజీల కిచిడీ సిద్ధం చేయగా.. అందులో పురుగులు ఉన్నాయని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఉన్న ప్రధాన కేంద్రంలోనే ఈ ఘటన జరగడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ప్రిన్సిపల్ పద్మావతిని వివరణ కోరగా.. కిచిడీలో పురుగులు ఉన్న మాట వాస్తవమేనని, జిసిసి నుంచి వచ్చిన బియ్యంలోనే పురుగులు రావడంతో అలా జరిగిందని తెలిపారు. పురుగులు ఉన్న బియ్యాన్ని వెనక్కి పంపిస్తున్నామని చెప్పారు. గతంలో ఇదే ఆశ్రమ పాఠశాలలో ఒక విద్యార్థిని సీనియర్ల వేధింపులు, పాఠశాలలో వసతులపై ఆవేదన వ్యక్తం చేస్తూ ఆత్మహత్యాయత్నం చేసుకున్న విషయం తెలిసిందే.ఐటిడిఎ పిఒ బి.రాహుల్ మాట్లాడుతూ.. కిచిడీలో పురుగుల వచ్చిన ఘటనపై విచారణకు ఆదేశించామని, ఆర్‌సీఓని విచారణ అధికారిగా నియమించామని, పూర్తి నివేదిక వచ్చిన వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకుంటామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ స్పష్టం చేశారు. ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్యను అందించేందుకు ఐటీడీఏ రాజీ లేకుండా పని చేస్తోందని తెలిపారు. విద్యార్థులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదన్నారు.

బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కె.రవీందర్

ఎస్ఎఫ్ఐ బృందం ఆశ్రమ పాఠశాలకు వెళ్లి సందర్శించిందని, ఘటనపై ప్రిన్సిపల్ అత్యంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రవీందర్ విమర్శించారు. ప్రిన్సిపాల్, వార్డెన్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని హెచ్చరించారు.

కులగణనపై ముఖ్యమంత్రికి నివేదిక అందజేస్తున్న నిపుణుల కమిటీ

కులగణనపై ప్రభుత్వానికి 300 పేజీల నివేదిక

- సమర్పించిన స్వతంత్ర నిపుణుల కమిటీ
- సిఎం రేవంత్‌తో కమిటీ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి బృందం భేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో చేపట్టిన కులగణనను అధ్యయనం చేయడానికి ప్రభుత్వం నియమించిన స్వతంత్ర నిపుణుల కమిటీ తన 300 పేజీల నివేదికను సమర్పించింది. శనివారం హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం (ఎమ్‌సిఆర్ హెచ్‌ఆర్‌డి)లో కమిటీ చైర్మన్ జస్టిస్ సుదర్శన్ రెడ్డి, సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కతోపాటు పలువురు మంత్రులు, నిపుణుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్రంలో కుల గణన అనేది శాస్త్రీయంగా, నిర్దిష్టంగా, వాస్తవాల ఆధారంగా జరిగిందని ఈ సందర్భంగా కమిటీ అభిప్రాయపడింది. ఇది చారిత్రాత్మకమని, దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తుందని పేర్కొంది. అనంతరం సిఎం రేవంత్ మాట్లాడుతూ... కుల గణన అనేది కేవలం ఒక డేటా కాదనీ, అది తెలంగాణకు మెగా హెల్త్ చెకప్ లాంటిదని వ్యాఖ్యానించారు. తమ నాయకుడు రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ఈ సర్వేను చేపట్టామని తెలిపారు.

బలహీనవర్గాల అభ్యున్నతికి, సామాజిక న్యాయాన్ని అమలు చేసేందుకు నివేదిక ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల మధ్య వ్యత్యాసాలు, అందుకుగల కారణాలపై అధ్యయనం చేయాలంటూ నిపుణుల కమిటీని ఆయన కోరారు. ప్రజల అవసరాలను గుర్తించి, సరైన సూచనలు, సలహాలను ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వాటి ఆధారంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాగా నిపుణుల కమిటీ సమర్పించిన నివేదికలోని అంశాలను, సూచనలను మంత్రివర్గంలో చర్చించిన అనంతరం ప్రభుత్వం తన తదుపరి కార్యాచరణను ప్రకటించనుంది.

పర్యావరణహిత నగరమే లక్ష్యం

- హైడ్రా వచ్చాకే బఫర్‌జోన్, ఎఫ్‌టిఎల్‌పై అవగాహన
- ఏడాది నుంచి ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాం
- హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రకృతి పరిరక్షణను మహాయజ్ఞంలా చేపట్టామని, రాజధానిని ముంపు నుంచి కాపాడి మంచి భవిష్యత్‌ను అందించడమే లక్ష్యంగా హైడ్రా పనిచేస్తోందని కమిషనర్ ఎవి.రంగనాథ్ తెలిపారు. హైడ్రా రాకతోనే కబ్జాలకు గురైన చెరువులను రక్షించుకోగలిగామన్నారు. హైడ్రా ఏర్పడి జూన్ 19తో ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా శనివారం హైదరాబాద్ రవీంద్రాభారతిలో 'ఇండ్ ఫేమ్ విజువల్ ఆర్ట్స్' ఆధ్వర్యంలో 'సామాజిక, పర్యావరణ అంశాలపై' వివిధ పాఠశాలల చెందిన విద్యార్థులు ఏర్పాటు చేసిన ప్రదర్శనను హైడ్రా కమిషనర్ రంగనాథ్ తిలకించారు. అనంతరం వార్షికోత్సవ వేడుకలలో కమిషనర్ ప్రసంగించారు. కబ్జాదారుల చెర నుంచి కాపాడిన చెరువులను పునరుద్ధరణ, పచ్చదనం, సుందరీకరణతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రజల సహకారంతో ఎన్నో సవాళ్లను సైతం ఎదుర్కొని విజయం సాధిస్తూ ముందుకెళ్తున్నామన్నారు. ఏడాదిలో 500 ఎకరాల భూములను ఆక్రమణల చెర నుంచి విడిపించామని, వాటి విలువ మార్కెట్‌లో రూ.30వేల కోట్ల వరకు ఉంటుందని తెలిపారు. ఆరు చెరువులను అభివృద్ధి చేస్తున్నామని, 75 ఎకరాల్లో పూడికను తొలగిస్తే 30కోట్ల లీటర్ల వరద నీటిని నిల్వచేసే వీలుంటున్నారు. ఈ ప్రయాణంలో అనేక ఆటంకాలు ఎదురౌతున్నా వెరవకుండా భవిష్యత్ తరాలకు పర్యావరణ ఫలాలు అందించేందుకు హైడ్రా అకుంఠిత దీక్షతో పని చేస్తోందన్నారు.

ప్రకృతి సంపదను కాపాడాలనే..

ప్రకృతి సంపదను కాపాడాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రాను ఏర్పాటు చేసిందని కమిషనర్ తెలిపారు. గొలుసుకట్టు చెరువులను పరిరక్షించి భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థను నెలకొల్పడమే కాకుండా, పోలీసు, మున్సిపాలిటీ, ఇరిగేషన్, రెవెన్యూ ఇలా వివిధ శాఖలకు చెందిన అధికారాలను కూడా ప్రభుత్వం కట్టపెట్టిందని వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందిస్తున్న ప్రోత్సాహానికి ధన్యవాదాలు తెలిపారు. ఆక్రమణల తొలగింపు చాలా కష్టతరమైనదని, కొంతమంది స్వార్థపరుల అత్యాశకు బలి కాకూడదని అన్నారు. హైడ్రా చర్యల వల్ల చిన్న పిల్లల్లో కూడా చెరువు, ఎఫ్‌టీఎల్, బఫర్ ఇలా అన్ని అంశాలపై అవగాహన కలిగిందన్నారు. సివిల్ సర్వీసెస్ ఇంటర్వ్యూలో కూడా హైడ్రా గురించి అభ్యర్థులను ప్రశ్నించారని గుర్తు చేశారు. హైడ్రా వంటి సంస్థ దేశవ్యాప్తంగా ఉన్నప్పుడే ప్రకృతిని కాపాడుకోగలమని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రత్యేకంగా ఒక కథనాన్ని ప్రచురించిందన్నారు. హైడ్రా వార్షికోత్సవంలో పాల్గొనడం చాలా గర్వంగా ఉందని ఈ కార్యక్రమంలో పాల్గొన్న సినీ దర్శకుడు తరుణ్ భాస్కర్ అన్నారు.

సభలో మాట్లాడుతున్న హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్

అందరినీ ఆలోచింపజేసిన ప్రదర్శన

ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు చెందిన వందలాది మంది విద్యార్థులు రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది. చెరువుల ఆవశ్యకతను కొందరు వివరిస్తే.. చెరువులను అనుసంధానం చేసే నాలాల పరిరక్షణ గురించి మరికొందరు ప్రదర్శించారు. ప్రకృతి తరతరాలుగా వస్తున్న ఆస్తి.. అది అందరిదీ అని.. భావితరాలకు అందివ్వాల్సిన బాధ్యత ఉందని చిన్నారులు వివరించిన తీరును చూసి అందరూ ముచ్చటపడ్డారు. హైడ్రా వార్షికోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ, హైడ్రా కార్యక్రమాలపైన 'ఇండ్ ఫేమ్ విజువల్ ఆర్ట్స్' వ్యవస్థాపకులు దాస్యం గీతా భాస్కర్ నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. వివిధ అంశాలపై అవగాహన కల్పించిన విద్యార్థులకు కూడా జ్ఞాపికలను హైడ్రా కమిషనర్ అందించారు.

ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించేలా మేడారం ఆధునీకరణ

- యాత్రికుల అవసరాలకే పెద్దపీట వేస్తాం
- పూజారుల అభిప్రాయాలు తీసుకుంటాం
- సమ్మక్క సారలమ్మ ఆలయ ఆధునీకరణపై సమీక్షలో మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసీ సంస్కృతిని ప్రతిబింబించేలా మేడారంలో ఆధునీకరణ పనులు చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) చెప్పారు. యాత్రికుల అవసరాలకు పెద్దపీట వేస్తామన్నారు. అభివృద్ధి పనుల్లో పూజారుల అభిప్రాయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదివాసీ సాంప్రదాయాలకు, పోరాటానికి, త్యాగానికి ప్రతీకగా నిలిచిన మేడారం సమ్మక్క సారలమ్మ ఆలయ ప్రాంగణ ఆధునీకరణపై మంత్రి సీతక్క సమీక్షించారు. భక్తుల సౌకర్యాల కోసం, ఆలయ పరిసరాల అభివృద్ధి కోసం చేపట్టబోయే మాస్టర్‌ప్లాన్‌పై చర్చించారు. సమావేశంలో దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ డైరెక్టర్ జి. సజన, ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్, సిఎండి వరుణ్ రెడ్డి, ఏటూరు నాగారం ఐటిడిఎ పిఒ చిత్ర మిశ్రా, మిషన్ భగీరథ ఎస్‌సీ కృపాకర్ రెడ్డి, గిరిజన సాంస్కృతిక శాఖ అధికారులు, సమ్మక్క సారలమ్మ జాతర పూజారుల సంఘం అధ్యక్షులు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు, తదితరులు పాల్గొన్నారు. ఆధునీకరణ పనుల ప్రణాళికపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయగా, మంత్రి సీతక్క పలు మార్పులను సూచించారు. సమ్మక్క, సారలమ్మ గద్దెల్లో మార్పుల్లేకుండా ఆలయ ఆవరణలో చేపట్టాల్సిన ఆధునీకరణ పనులపై పలు సూచనలు చేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ..పూజారుల విశ్రాంతి గదులు, అత్యవసర వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, మీడియా ప్రతినిధులకు అవసరమైన వసతుల కల్పనకు సంబంధించి స్పష్టమైన ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. జంపన్న వాగు అభివృద్ధికి రూ.5 కోట్లు మంజూరయ్యాయనీ, భక్తుల సౌలభ్యం కోసం ఘాట్లను నిర్మిస్తామని తెలిపారు. వారం రోజుల్లో గద్దెల చుట్టూ ఆధునీకరణ పనులకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేసి, పూజారుల ఆమోదంతో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. భక్తుల కోసం మరిన్ని వసతులు కల్పించేందుకు కుంభమేళా లాంటి పెద్ద ఉత్సవాలలో వసతులు కల్పించిన ఏజెన్సీలను సంప్రదించి వారి సలహాలు తీసుకుని ముందుకెళ్తామన్నారు. మేడారానికి వెళ్లే అన్ని మార్గాల్లో ఆదివాసీ పోరాట యోధుల విగ్రహాలు, చిహ్నాలను ప్రతిష్టిస్తామన్నారు. వచ్చే మేడారం జాతర లోపు పూర్తి చేయాల్సిన పనులపై మొదట దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.

ఈసెట్‌లో 10,186 మందికి సీట్ల కేటాయింపు

- ఇంజనీరింగ్‌లో 10,129 మంది, ఫార్మసీలో 57 మంది
- సెల్ఫ్ రిపోర్టింగ్ గడువు 20

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో బిటెక్, బిఇ, బి ఫార్మసీ, బిఎస్‌సి మ్యాథమెటిక్స్ కోర్సుల్లో ద్వితీయ సంవత్సరంలో లాటరల్ ఎంట్రీ ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఈసెట్ తుదివిడత కౌన్సెలింగ్‌లో శనివారం సాంకేతిక విద్యాశాఖ సీట్లు కేటాయించింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఈసెట్ ప్రవేశాల కన్వీనర్ ఎ శ్రీదేవసేన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈసెట్‌లో 17,768 మంది అర్హత సాధించారని తెలిపారు. వారిలో 13,001 మంది ధ్రువపత్రాల పరిశీలనకు హాజరయ్యారని పేర్కొన్నారు. వారిలో 8,909 మంది 3,52,593 వెబ్‌ఆప్షన్లను నమోదు చేశారని వివరించారు. ఈసెట్‌లో ఇంజనీరింగ్‌లో 12,618 సీట్లు, ఫార్మసీలో 1,287 సీట్లు కలిపి మొత్తం 13,905 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈసెట్ తుది విడత కౌన్సెలింగ్‌లో ఇంజనీరింగ్‌లో 10,129 మంది, ఫార్మసీలో 57 మంది కలిపి మొత్తం 10,186 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని పేర్కొన్నారు. ఇంజనీరింగ్‌లో 2,489 సీట్లు, ఫార్మసీలో 1,230 సీట్లు మిగిలాయని తెలిపారు. తుదివిడతలో స్లైడింగ్ అయిన అభ్యర్థులు 1,245 మంది ఉన్నారని పేర్కొన్నారు. తుదివిడతలో కొత్తగా సీట్లు పొందిన వారు 2,848 మంది ఉన్నారని తెలిపారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతులు (ఈడబ్ల్యూఎస్) కోటాలో 514 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. సీట్లు పొందిన అభ్యర్థులు ష్ట్రజూం:7/స్త్రవఎవ్.అఱఎ.అఅ వెబ్‌సైట్ ద్వారా ఈనెల 20 వరకు సెల్ఫ్‌రిపోర్టింగ్ చేయాలని కోరారు. సెల్ఫ్ రిపోర్టింగ్ చేయకుంటే సీటు రద్దవుతుందని స్పష్టం చేశారు. ఈసెట్ తుదివిడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 22 వరకు కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించారు. ఒరిజినల్ టీసీ, ధ్రువపత్రాల జిరాక్స్ ప్రతులను ఇవ్వాలని కోరారు. ఆయా తేదీల్లో సీట్లు కేటాయించిన కాలేజీల్లో అభ్యర్థులు రిపోర్టు చేయకుంటే రద్దవుతుందని తెలిపారు.

సివిల్, మెకానికల్ కోర్సులకే డిమాండ్

ఇంజనీరింగ్‌లో సిఎస్‌ఈ అనుబంధ కోర్సుల్లో చేరేందుకు ఎక్కువ మంది అభ్యర్థులు మొగ్గు చూపుతున్నారు. ఈసెట్‌లో సివిల్, మెకానికల్ కోర్సులకే డిమాండ్ ఉన్నది. ఈసెట్ తుదివిడత కౌన్సెలింగ్‌లో సీఎస్‌ఈ, ఐటీ అనుబంధ కోర్సుల్లో 8,552 సీట్లుంటే 6,205 (72.56 శాతం) మందికి సీట్లు కేటాయించారు. 2,347 సీట్లు మిగిలాయి. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ కోర్సుల్లో 2,649 సీట్లుండగా, 2,604 (98.30 శాతం) మందికి సీట్లు కేటాయించారు. కేవలం 45 సీట్లు మాత్రమే మిగిలాయి. సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సుల్లో 1,276 సీట్లుంటే, 1,193 (93.50 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఇందులో కేవలం 83 సీట్లు మిగిలాయి. ఇతర ఇంజనీరింగ్ కోర్సుల్లో 141 సీట్లుండగా, 127 (90.07 శాతం) మందికి సీట్లు కేటాయించారు. 14 సీట్లు మిగిలాయి. బీ ఫార్మసీలో 1,287 సీట్లుంటే, 57 (4.43 శాతం) మందికి సీట్లు కేటాయించారు. 1,230 సీట్లు మిగిలాయి.

ఉస్మానియాలో కాలేయ మార్పిడి సర్జరీ

- వైద్యులకు సిఎం అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉస్మానియా వైద్య బృందానికి ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఎక్స్‌లో అభినందనలు తెలిపారు. కాలేయ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. "నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అన్న దురాభిప్రాయాన్ని చెరిపేసి, బ్లెస్సీ గౌడ్‌కు 24 గంటల్లోపు విజయవంతంగా కాలేయ మార్పిడి. శస్త్రచికిత్సతో పునర్జన్మ ప్రసాదించిన ఉస్మానియా వైద్య బృందానికి నా అభినందనలు. ప్రతి ప్రభుత్వ వైద్యుడికి ఈ వైద్య బృందం ఆదర్శం కావాలి. బీటెక్ విద్యార్థిని బ్లెస్సీ గౌడ్ నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని మనసారా కోరుకుంటున్నాను" అని సీఎం పేర్కొన్నారు.

IN THE COURT OF THE HON'BLE
JUNIOR CIVIL JUDGE,
RANGA REDDY DISTRICT
AT :: AMANGAL
O.S.No. 1249 of 2022
Between:-
Uduthala Satish Goud
And
...Plaintiff
Eslavath Ravi and others
...Defendants
To
1) Eslavath Ravi S/o. E.Bhasha Aged 30 years, Occ: Agriculture R/o. Mysigandi, Yeluguralla Thanda, Kadthal Mandal Ranga Reddy District.
Defendant No.1
2) Eslavath Pandu S/o. E.Devija Aged 35 years, Occ: Agriculture R/o.Mysigandi. Yeluguralla Thanda, Kadthal Mandal Ranga Reddy District.
Defendant No.2
3) Eslavath Srinu S/o. E.Devija Aged 30 years, Occ: Agriculture Ranga Reddy District. R/o.Mysigandi, Yeluguralla Thanda, Kadthal Mandal
Defendant No.3
Take notice that the Plaintiffs filed the above suit for specific performance against you and the said suit is stands posted to 07-08-2025 for your appearance and written statement if any. Hence, you are hereby directed to be appear before the above Court on **07-08-2025** at **10.30** a.m. either in person or through an Advocate, failing which the matter will be decided basing on the documents available on record.
(BY ORDER OF THE COURT)
M.LAXMA REDDY
Advocate
Counsel for Plaintiff

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.NO.188/2025
I.A.NO.478/2023
O.S.NO.07/2008
బండారు శారద .. పిటిషనర్/వాది
వర్సెస్
ఈర్ల వెంకటరత్నం మరియు ఇతరులు
... రెస్పాండెంట్లు/ప్రతివాదులు
To:
R9) ఈర్ల సావిత్రి, భర్త లేట్ వెంకటస్వామి
R10) ఈర్ల అంకిత, తండ్రి లేట్ వెంకటస్వామి
R11) ఈర్ల అరుణ్, తండ్రి లేట్ వెంకటస్వామి
వీరందరిదీ ప్రస్తుత నివాసం: సంగారెడ్డి పట్టణం & మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరు పిటిషన్ లోని 9వ రెస్పాండెంట్ కి భర్త గారు మరియు 10,11 రెస్పాండెంట్లకు తండ్రిగారు అయిన 6వ రెస్పాండెంట్ చనిపోయినందున మిమ్మల్ని వారసులుగా చేర్చమని పిటీషన్ దాఖలు చేసి మీకు నోటీసులు పంపించిన ను మీరు నోటీసులు తీసికొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు నోటీసులు జారీ నిమిత్తం వాయిదా తేదీ: 05-08-2025న వేసి ఉన్నారు. ఆరోజు ఉదయం గం 10.30 ని లకు పై కోర్టు ఎదుట మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరపడి మీ ఆక్షేపణలు తెలియపరచగలరు. లేనియెడల మీ పరోక్షమందు పిటిషన్ తీర్మానించబడునని తెలియపరచ మైనది.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది: 05-08-2025
ఇట్లు
గడ్డి శ్రీనివాసులు,
పిటీషనరు తరపు న్యాయవాది,
దరిశి, ప్రకాశం జిల్లా.
సెల్:9441125875

మహారాజశ్రీ దరిశి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.A.NO.189/2025
I.A.NO.478/2023
O.S.NO.07/2008
బండారు శారద .. పిటిషనర్/వాది
వర్సెస్
ఈర్ల వెంకటరత్నం మరియు ఇతరులు
... రెస్పాండెంట్లు/ప్రతివాదులు
To:
R9) ఈర్ల సావిత్రి, భర్త లేట్ వెంకటస్వామి
R10) ఈర్ల అంకిత, తండ్రి లేట్ వెంకటస్వామి
R11) ఈర్ల అరుణ్, తండ్రి లేట్ వెంకటస్వామి
వీరందరిదీ ప్రస్తుత నివాసం: సంగారెడ్డి పట్టణం & మండలం, సంగారెడ్డి జిల్లా, తెలంగాణ రాష్ట్రం.
పై నెంబరు పిటిషన్ లోని 9వ రెస్పాండెంట్ కి భర్త గారు మరియు 10,11 రెస్పాండెంట్లకు తండ్రిగారు అయిన 6వ రెస్పాండెంట్ చనిపోయినందున మిమ్మల్ని వారసులుగా చేర్చమని పిటీషన్ దాఖలు చేయడం జరిగినది. ఆ పిటిషన్‌లో 10 మరియు 11వ రెస్పాండెంట్లు మైనర్లు అయినందున 9వ రెస్పాండెంటు ను గార్డియన్ గా నియమించమని ఫిటిషన్ దాఖలు చేసి మీకు నోటీసులు పంపించినను మీరు నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున ఈ పేపర్ ప్రకటన ద్వారా మీకు నోటీసులు నిమిత్తం వాయిదా తేదీ: 05-08-2025 న వేసిఉన్నారు. ఆరోజు ఉదయం గం 10.30ని లకు పైకోర్టు ఎదుట మీరు స్వయంగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరపడి మీ ఆక్షేపణలు తెలియపరచగలరు. లేనియెడల మీ పరోక్షమందు పిటిషన్ తీర్మానించబడునని తెలియపరచ మైనది.
// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది: 05-08-2025
ఇట్లు
గడ్డి శ్రీనివాసులు,
పిటీషనరు తరపు న్యాయవాది,
దరిశి, ప్రకాశం జిల్లా.
సెల్:9441125875

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఆత్మహత్య

- జీవితాన్ని అతలాకుతలం చేసిన చిట్టీల వ్యాపారం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

చిట్టీల వ్యాపారం ఓ ఉపాధ్యాయ కుటుంబాన్ని ఆర్థికంగా అతలాకుతలం చేసింది. ఆస్తులు, ఇల్లు, బంగారం అన్నీ అమ్మేసి అప్పులు కట్టి సెటిల్‌మెంట్ చేసుకున్నా.. స్నేహితులు మోసం చేసి చెక్కుబౌన్స్ కేసులు వేసి వేధించడంతో తట్టుకోలేక ఆ ఉపాధ్యాయుడు ప్రాణం తీసుకున్నాడు. మెదక్ పట్టణానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు కాముని రమేష్(52) శనివారం మేడ్చల్‌లోని ఓ ప్రయివేటు లాడ్జిలో ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలను వీడియోలో పేర్కొన్నాడు. ఆ వీడియో వైరల్‌గా మారింది. కుటుంబీకులు, వీడియో రికార్డులో ఉన్న వివరాల ప్రకారం.. కాముని రమేష్ హవేలీ ఘనపూర్ మండలంలోని సర్దన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రమేష్ చిట్టీలు నడిపించేవాడు. ఈ క్రమంలో రూ.7కోట్ల వరకు అప్పులయ్యాయి. ఇల్లు, భూమి, భార్య బంగారం నగలు అమ్మేసి అప్పులు కట్టి సెటిల్‌మెంట్ చేసుకున్నాడు. కానీ, డబ్బులు తీసుకున్నాక స్నేహితులే ద్రోహం చేశారు. ఆ తర్వాత చెక్కుబౌన్స్ కేసులు వేసి వేధించడం వల్ల మానసికంగా కుంగిపోయాడు. దాంతో కొందరి పేర్లు చెబుతూ వీడియో రికార్డ్ చేసి ఆత్మహత్య చేసుకున్నాడు. చిట్టీల వ్యాపారం చేసినా కొంతమందికి ఆర్థిక సాయం చేయడంతోపాటు ఎక్కడ పనిచేసినా అక్కడ పాఠశాల అభివృద్ధికి ఎంతగానో కృషి చేసేవారని పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

ఆర్‌ఎస్‌వితో శిశువులకు ముప్పు

- నిర్సేనిమాబ్ డోస్‌తో ఎదుర్కోవచ్చు : నిపుణులు

ప్రజాశక్తి – హైదరాబాద్ : భారత్‌లో శ్వాసకోశ సమస్యలకు కారణమయ్యే రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ (ఆర్‌ఎస్‌వి) శిశువులకు పెను ముప్పుగా ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ వైరస్ మాన్సూన్, శీతాకాలంలో ఐదేళ్లలోపు పిల్లలలో తీవ్రమైన బ్రాంకియోలైటిస్, న్యుమోనియాకు దారితీస్తుంది. దీనివల్ల ఆసుపత్రి చేరికలు పెరుగుతున్నాయి. నిర్సేవిమాబ్ వంటి మోనోక్లోనల్ యాంటీబాడీలు, మాతృ టీకాలు ఈ సమస్యను తగ్గించగలవని నిపుణులు సూచిస్తున్నారు. ఆర్‌ఎస్‌వి శిశువులకు ముప్పు, నిర్సేవిమాబ్ వంటి నివారణ చర్యలతో అవగాహన కల్పించడం కీలకమని ఐఎపి అధ్యక్షులు డాక్టర్ వసంత్ ఎం ఖలాత్కర్ పేర్కొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

- ఆర్మూర్ సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఘటన

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని పిప్రి రోడ్డులో గల తెలంగాణ సోషల్ వెల్ఫేర్ కాలేజీలో శనివారం ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రిన్సిపల్, పిఇటిపై కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధించి ఎస్‌హెచ్‌ఓ సత్యనారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన గడ్డం సంతోష్ (17) సోషల్ వెల్ఫేర్ కళాశాలలో ఇంటర్ బైపిసి ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సంతోష్ గ్రౌండ్‌లో వ్యాయామం చేశాడు. ఆ తర్వాత కనిపించకపోయేసరికి అతని కోసం వెతకగా.. కళాశాల వెనుక చెట్టుకు ఉరేసుకుని వేలాడుతూ విగత జీవిగా కనిపించాడు. కారణాలు తెలియరాలేదు. ఈ విషయమై నిర్వాహకులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెంటనే కాలేజీకి వచ్చి కొడుకుని చూసి కన్నీరుమున్నీరయ్యారు. సంతోష్ మృతి విషయంలో కాలేజీ ప్రిన్సిపాల్, పీఈటీ నిర్లక్ష్యం ఉందంటూ అతని అన్న గడ్డం శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహా నికి పంచనామా చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విపత్తులపట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఆధునికతతో ఎస్‌ఎల్‌బిసి పునరుద్ధరణ
- వ్యవసాయ శాఖతో సమన్వయం అవసరం
- ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

అధికారులతో మాట్లాడుతున్న ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

వానకాలం పంటలకు సమృద్ధిగా నీరు అందించేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మీదట అటు వానాకాలం ఇటు యాసంగి పంటలకు ప్రణాళికా బద్ధంగా నీటిని విడుదలచేసి అద్భుతమైన ఫలితాలు సాధించామన్నారు. వ్యవసాయశాఖతో నీటిపారుదల శాఖాధికారులు సమన్వయం చేసుకున్న నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రం 281 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించి యావత్ భారతదేశంలోనే అగ్రగామిగా నిలిచిందన్నారు. ఖరీఫ్ పంటకు నీటి విడుదలతో పాటు ఆధునిక పరిజ్ఞానంతో ఎస్‌ఎల్‌బీసీ పునరుద్ధరణ, నీటిపారుదల శాఖ భూముల పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం సచివాలయంలో నీటి పారుదల శాఖాధికారులతో మంత్రి ఉత్తమ్ ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, నీటిపారుదల శాఖ సలహాదారు అదిత్యాదాస్‌నాథ్, సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఈఎన్సీలు అంజాద్ హుస్సేన్, శ్రీనివాస్, రమేష్‌బాబు తదితరులతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న నీటిపారుదల సిఇలు, ఎస్‌ఇలు ఇతర ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మాట్లాడూతూ వానాకాలం పంటలకు నీటి విడుదలపై రూట్ మ్యాప్ రూపొందించుకుని తక్షణమే అమలుచేయాలని ఆదేశించారు. సాగునీటి అంశంలో ఏ ఒక్క రైతు ఇబ్బంది పడకుండా చూసుకోవాలని ఆయన సూచించారు. నీటి విడుదల విషయమై నీటిపారుదల శాఖా మొత్తం దష్టి కేంద్రీకరించి చివరి ఆయకట్టు వరకు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ వర్షాకాలంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు పడితే ఎదురయ్యే పరిణామాల పట్ల ముందస్తు బందోబస్తు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ప్రధాన అనకట్టలతో పాటు జలాశయాలు, కాలువలను అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు వీలుగా అధికారులు సన్నద్ధం కావాలని ఆయన ఆదేశించారు. వర్షాకాలంలో అతిభారీ వర్షాలకు గండ్లు పడకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. విపత్తులు వస్తే తక్షణమే నష్టనివారణ చర్యలకు అధికారులు అప్రమత్తంగా ఉండి పటిష్టమైన బందోబస్తు చర్యలు చేపట్టాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎస్‌ఎల్‌బీసీ పునరుద్ధరణ చర్యలు చేపడుతున్నట్టు ఆయన వెల్లడించారు. సుమారు 10 కిలో మీటర్ల దూరం సొరంగమార్గం పనులు పూర్తి చేసేందుకు గాను చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సొరంగం పనులలో అపారమైన అనుభవం కలిగిన మాజీ ఇంజినీర్ ఇన్ చీఫ్ జనరల్ హర్పల్‌సింగ్‌ను నీటిపారుదల శాఖకు గౌరవ సలహాదారుగా నియమిస్తున్నట్టు ఆయన ప్రకటించారు.ఆయన సాంకేతిక అనుభవంతో ఎస్‌ఎల్‌బీసీ సొరంగమార్గంతో పాటు ఇతర సొరంగాలను పూర్తి చేసేందుకు దోహదపడతారని ఆయన చెప్పారు.

వేడుకగా అనురాగ్ యూనివర్సిటీ స్నాతకోత్సవం

ప్రజాశక్తి – హైదరాబాద్

బంజారాహిల్స్‌లో నిర్వహించిన అనురాగ్ యూనివర్సిటీ 2వ స్నాతకోత్సవం వేడుకగా జరిగింది. ఇందులో 2,260 మంది విద్యార్థులకు ఇంజనీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ డిగ్రీలు, పది మందికి సైన్స్, ఇంజనీరింగ్‌లో పరిశోధనకు డిగ్రీలు ప్రదానం చేశారు. 75 మంది అకాడమిక్ టాపర్స్ గోల్డ్ మెడల్స్ అందుకున్నారు. 2025లో 1,500 మంది ఉద్యోగాలు పొందగా, 2021 నుండి 10,000 మందికి పైగా జాబ్ ఆఫర్స్ లభించాయి, యూనివర్సిటీ నాణ్యమైన విద్య, ప్లేస్‌మెంట్ విజయాన్ని చాటుతున్నాయని ఆ యూనివర్సిటీ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కాన్వొకేషన్ భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే యువతను తయారు చేయడంలో తమ నిబద్ధతను చాటుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఎఐసిటిఇ) చైర్మన్ ప్రొఫెసర్ టిజి సీతారాం హాజరు కాగా.. యూనివర్సిటీ చైర్మన్ పి రాజేశ్వర్ రెడ్డి, ఛాన్సలర్ యు.బి. దేశాయ్, వైస్ ఛాన్సలర్ అర్చనా మంత్రి, సిఇఒ ఎస్ నీలిమతో సహ ప్రముఖులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో బూతులు సరికాదు

- తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

రాజకీయాల్లో బూతులు సరికాదని తెలంగాణ జనసమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణా రాజకీయాల్లో విమర్శ, ప్రతి విమర్శలు జుగుప్సాకరంగా తయారయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. విధాన పరమైన విశ్లేషణలతో జరగాల్సిన చర్చలు తాత్కాలికంగా పైచేయి సాధించాలనే ఆతృతలో వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. భూతులు మాట్లాడితేనే పోలింగ్ భూతుల్లో ఓట్లు పడేస్థాయికి రాజకీయాలను తీసుకొచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యలను పక్కదారి పట్టించేందుకు అధికార పార్టీతో పాటు ప్రతిపక్షాలు బూతు పురణాన్ని అందకుంటున్నాయని ఎద్దేవా చేశారు. రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు వీరి ట్రాప్‌లో పడకుండా సంయమనం పాటించాలని కోరారు. ఈ సమావేశంలో జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిలు బైరి రమేష్, పల్లె వినయ్, నిజన రమేష్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నరసయ్య గౌడ్, యువజన సమితి రాష్ట్ర అధ్యక్షులు సలీం పాషా, విద్యార్థి జన సమితి రాష్ట్ర అధ్యక్షులు మాసంపల్లి అరుణ్ కుమార్, రాష్ట్ర పార్టీ కార్యాలయం ఇంచార్జ్ హనుమంత రెడి, ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాన జలాశయాల్లో డెడ్ స్టోరేజీ ఘంటికలు

- ఉమ్మడి కరీంనగర్‌లో లోటు వర్షపాతం
- భారీగా సాగు లక్ష్యాలు..
- క్షేత్రస్థాయిలో పరిస్థితి ప్రశ్నార్థకం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

నైరుతి రుతుపవనాలు ప్రవేశించి నెల రోజులు దాటినా, ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అనేక ప్రాంతాల్లో సాగునీటి ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి కరీంనగర్‌లో లక్షల ఎకరాల్లో పంటలు సాగు కావాల్సిన తరుణంలో పొలాలు బీటలు వారుతున్నాయి. సాగు లక్ష్యాలు భారీగా ఉండటం.. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో సాగు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో మేడిగడ్డ బ్యారేజీ వద్ద పిల్లర్ల మరమ్మతు వదిలేసినా.. కన్నెపల్లి పంపుహౌజ్ వద్ద ఎత్తిపోతలకు పరిశీలించాలని పలువురు ప్రభుత్వానికి సూచిస్తున్నారు. మేడిగడ్డ బ్యారేజీ వద్ద పిల్లర్లు కుంగకముందు గతంలో కాళేశ్వరం ఎత్తిపోతల పథకం రైతన్నలకు అండగా నిలిచింది. కానీ, మేడిగడ్డ బ్యారేజీ వద్ద పిల్లర్ కుంగిన ఘటనతో ఈ ప్రాజెక్టు నుంచి నీటి ఎత్తిపోతలు రెండేండ్లుగా నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో మేడిగడ్డతో సంబంధం లేకుండా కన్నెపల్లి పంపుహౌజ్ నుంచి నీటిని ఎత్తిపోసే అవకాశాన్ని పరిశీలించాలన్న డిమాండ్లు వినిపిస్తున్నా.. అధికార పార్టీ నేతలూ అంటున్నా ఈ విషయాన్ని బయటకు చెప్పలేకపోతున్నారు. ప్రస్తుతం కన్నెపల్లి వద్ద 96 మీటర్ల మేర ప్రవాహం కొనసాగుతుంది. 93.5 మీటర్ల నుంచి 94.5 మీటర్ల ప్రవాహం ఉంటేనే పంపులను ప్రారంభించే అవకాశం ఉండటంతో ఈ బారాజ్ నుంచి రోజుకు 20 వేల క్యూసెక్కులకుపైగా అంటే, రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసుకునే వెసులుబాటు ఉంది. ఈ ఎత్తిపోతలకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఏ కూడా కన్నెపల్లి నుంచి అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులకు నీటిని ఎత్తిపోయడానికి ఎక్కడా అభ్యంతరం తెలపలేదు. ఈ నీటిని ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువమానేరు, మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్లతోపాటు ఎగువ మానేరు వరకు ఎత్తిపోసే అవకాశం ఉందని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అంటున్నారు. ఎస్సారెస్పీ పునర్జీవం ద్వారా వరద కాలువను నిండుగా నింపుకోవడంతోపాటు ఈ పరిధిలోని అన్ని చెరువులనూ నింపడానికి పుష్కలమైన అవకాశాలున్నాయి.

ఉమ్మడి కరీంనగర్ అంతటా లోటువర్షమే!

వర్షాభావ పరిస్థితులు ఉమ్మడి కరీంనగర్ జిల్లాను తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. మొత్తం 63 మండలాలకుగాను 52 మండలాల్లో తీవ్ర లోటు వర్షపాతం నమోదైంది. పెద్దపల్లి జిల్లాలో (–53శాతం), కరీంనగర్ జిల్లాలో (–34శాతం), జగిత్యాల జిల్లాలో (–34శాతం), రాజన్న సిరిసిల్ల జిల్లాలో (–32శాతం)గా ఉంది.

పెద్దపల్లి జిల్లాలోని ఓదెల మండలంలోనే అత్యధికంగా 65శాతం లోటు వర్షపాతం నమోదు కాగా, రామగుండం 61శాతం, సుల్తానాబాద్ 60శాతం, కరీంనగర్ రూరల్‌లో 59శాతం వంటి అనేక మండలాలు 50శాతానికిపైగా లోటుతో అల్లాడుతున్నాయి. ఈ ప్రభావంతో జిల్లాలోని 1,376 చెరువులు, కుంటలు నీరు లేక బోసిపోతున్నాయి. వాగులు, వంకలు పారకపోవడంతో భూగర్భ జలాలు కూడా అడుగంటిపోతున్నాయి.

భారీ సాగు లక్ష్యాలు..

క్షేత్రస్థాయిలో రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ శాఖ లక్ష్యాలకు పూర్తి విరుద్ధంగా, నీటి ఎద్దడి కారణంగా పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. జగిత్యాల జిల్లాలో 3.10 లక్షల ఎకరాల్లో వరి సాగు అంచనా వేయగా, ఇప్పటివరకు 27.82శాతం మాత్రమే సాగైంది. కరీంనగర్ జిల్లాలో 3.4 లక్షల ఎకరాలకుగాను కేవలం 75,715 ఎకరాల్లోనే సాగు చేపట్టారు. పొలాల్లో ఉండాల్సిన నాట్లు నీళ్ల లేక నారుమడుల్లోనే ముదిరిపోతున్నాయి. రైతులు పెట్టిన పెట్టుబడి నీటిపాలయ్యే ప్రమాదం ఏర్పడింది. దీనికితోడు పొడి వాతావరణం కారణంగా పత్తిలో రసం పీల్చే పురుగులు, మొక్కజొన్నలో కత్తెర పురుగు వంటి చీడపీడల బెడద కూడా మొదలైంది. పంటల బీమా పథకంపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేకపోవడం అన్నదాతలను మరింత ఆందోళనకు గురిచేస్తోంది.

అడుగంటిన జలాశయాలు

ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీటిని అందించే కీలక జలాశయాలు నీటి నిల్వలు లేక కళావిహీనంగా మారాయి. శ్రీపాద ఎల్లంపల్లి, మధ్యమానేరు, దిగువమానేరు జలాశయాల్లో నీరు డెడ్ స్టోరేజీకి పడిపోయింది. మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో శ్రీరాంసాగర్‌లోకి నామమాత్రపు ఇన్‌ఫ్లో వస్తున్నప్పటికీ, అది లక్షల ఎకరాల ఆయకట్టుకు ఏ మాత్రమూ సరిపోదు.

రేవంత్‌రెడ్డీ... భాష మార్చుకో

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన బాష మార్చుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేసిన సభలో రాజకీయ విమర్శలు తగదని సూచించారు. వెళ్లిన ప్రతిచోటా పదేండ్లు నేనే ముఖ్యమంత్రి అని చెప్పుకుంటున్న ఆయన మాటలను సొంత పార్టీ ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఖండించడమే ఆయన స్థాయిని సూచిస్తుందని అన్నారు. "తెలంగాణ విధ్వంసం అయింది కాంగ్రెస్, టిడిపి, పాలనలోనే. జూరాల నిర్మాణానికి నాలుగు దశాబ్దాల సమయం తీసుకున్నారు.

కాజీపేట ఆర్‌ఎంయు వచ్చే ఏడాది ప్రారంభం

- కోచ్‌లు, ఇంజన్‌లు, మెట్రో రైళ్ల తయారీ
- రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

ప్రజాశక్తి –హైదరాబాద్ బ్యూరో

కాజీపేటలో నిర్మిస్తున్న నూతన అత్యాధునిక రైల్వే మ్యాన్‌ఫ్యాక్చరింగ్ యూనిట్ (ఆర్‌ఎంయు)లో 2026లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. మరో మంత్రి కిషన్‌రెడ్డితో కలిసి ఆయన శనివారం మధ్యాహ్నం ఆర్‌ఎంయు పనులను పరిశీలించారు. అనంతరం విలేకరుల సమావేశంలో అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. రూ.500 కోట్ల అంచనాతో ఈ ప్రాజెక్టును ప్రారంభించామని, ఈ ఏడాది డిసెంబర్‌లోపు సివిల్ వర్క్స్ పూర్తవుతాయని చెప్పారు. ఇక్కడ రైల్వే కోచ్‌లు, ఇంజన్‌లు, మెట్రో కోచ్‌లు, వ్యాగన్‌ల తయారీ అవుతాయన్నారు. వందేభారత్ రైల్వే కోచ్‌లకు డిమాండ్ అధికంగా వుందని, ఇప్పటికే 150 వందేభారత్ కోచ్‌ల ఎగుమతులకు సంబంధించిన ఆర్డర్‌లు వచ్చాయని తెలిపారు. మెట్రో కోచ్‌ల ఎగుమతుల కోసం కూడా ఆర్డర్లు వచ్చాయన్నారు. కాజీపేట ఆర్‌ఎంయూలో 4 విశాలమైన బే 1, బే 2, బే 3, బే 4లను నిర్మించారన్నారు.

40 ఏండ్ల కల సాకారమవుతోంది : కిషన్‌రెడ్డి

కాజీపేటలో ఆర్‌ఎంయు 40 ఏండ్ల కల అని, ప్రాజెక్టు నిర్మాణంతో ఆ కల సాకారమవుతోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖామంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. వరంగల్‌లో కోచ్ ఫ్యాక్టరీ అనేక దశాబ్దాల ప్రజల కల అని అన్నారు. ఈ యూనిట్ ద్వారా సుమారు 3 వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. తెలంగాణలో మొత్తం 40 రైల్వే స్టేషన్ల అభివృద్ధి జరుగుతోందని తెలిపారు. ఇందులో వరంగల్ రైల్వే స్టేషన్ కూడా ఉందన్నారు.

మంత్రికి భూనిర్వాసితుల వినతి

భూ నిర్వాసితులు రైల్వే మంత్రిని కలిసి ఉద్యోగావకాశాలు ఇవ్వాలని కోరారు. అయితే, రైల్వే జాక్ నేతలు మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి మెమోరాండం ఇవ్వడానికి గంటల తరబడి వేచి చూసినా ఫలితం లేకపోయింది. రైల్వే అధికారులు సరైన ఏర్పాట్లు చేయలేదు.

దీక్షలనుద్దేశించి మాట్లాడుతున్న తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్

ఎకరానికి రూ.కోటి పరిహారం ఇచ్చినా తక్కువే..

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్
- భూనిర్వాసితుల రిలే నిరాహార దీక్షలకు మద్దతు

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

మక్తల్, నారాయణపేట, కోడంగల్ ఎత్తిపోతల పథకం భూ నిర్వాసితులకు ఎకరం భూమికి కోటి రూపాయల పరిహారం ఇచ్చినా తక్కువేనని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు వద్ద ఐదు రోజుల నుంచి జరుగుతున్న భూనిర్వాసితుల రిలే నిరాహార దీక్షలకు శనివారం ఆయన మద్దతు తెలిపి ప్రసంగించారు. ఈ జిల్లాకు చెందిన మంత్రి వాకిటి శ్రీహరి స్పందించాలని, బహిరంగ మార్కెట్ ధరలకనుగుణంగా నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించే విషయంలో ముఖ్యమంత్రితో మాట్లాడాలని కోరారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో భూ నిర్వాసితులకు న్యాయమైన పరిహారం అందించాలన్నారు. రింగ్ రోడ్డు, నేషనల్ హైవేలకు ఖమ్మం, భువనగిరి, సంగారెడ్డి జిల్లాల్లో రూ.50లక్షల నుంచి 60 లక్షల మేర పరిహారం అందిస్తుంటే సీఎం సొంత నియోజకవర్గంలో రూ.14లక్షల పరిహారం ప్రకటించడం అన్యాయమన్నారు. న్యాయమైన పరిహారం అందే వరకు నిర్వాసితులకు రైతు సంఘం మద్దతుగా ఉండి పోరాడుతుందని హామీనిచ్చారు. రైతు తన ఇష్టంతో భూమిని అమ్ముకోవడం లేదని, ప్రాజెక్టు కోసం.. ప్రభుత్వం మాట ప్రకారమే భూమిని అమ్ముతున్నారని, అలాంటి రైతుకు సరైన పరిహారం అందించి ఆనందంగా ఉంచాలని అన్నారు. అన్ని విధాలుగా వెనుకబాటుకు గురైన నారాయణపేట ప్రాంతానికి నీరు అవసరం.. ప్రాజెక్టు అవసరం.. అదే సందర్భంలో ప్రాజెక్ట్‌కు భూమి ఇస్తున్న రైతును కూడా సంతోషపరచాల్సిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. ఈ దీక్షలలో భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు జి.వెంకట్రామ రెడ్డి, జిల్లా అధ్యక్షులు మశ్చందర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలరామ్, జోషి, తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు అంజిలయ్య గౌడ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు, భూనిర్వాసితుల జిల్లా ఉపాధ్యక్షులు ధర్మరాజు, రైతు సంఘం నాయకులు రామకృష్ణ, దస్తప్ప శివకుమార్, ఉట్కూర్ రైతులు పాల్గొన్నారు.

ఎవరి కోసం 'క్వార్టర్ల' నిర్మాణం?

- సింగరేణి 'సొంత' కట్టడం రూ.450 కోట్లతో
- ఉద్యోగ విరమణ తర్వాత అందని ద్రాక్షగానే కొత్త క్వార్టర్లు
- సంస్థ ఆస్తులు ప్రయివేటుపరం చేసే కుట్రేనంటున్న కార్మిక సంఘాలు
- కార్మికుని సొంతింటి 'కల'ను నీరుగార్చుతున్న యాజమాన్యం

ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో

సింగరేణి యాజమాన్యం కార్మికుల సంక్షేమం పేరుతో కొత్త క్వార్టర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. రూ.450 కోట్ల భారీ బడ్జెట్‌తో, 1003 కొత్త క్వార్టర్లను నిర్మించాలనే ఈ ప్రతిపాదన పైకి ఆకర్షణీయంగా కనిపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో ఎన్నో అనుమానాలకు తావిస్తోంది. దశాబ్దాల సింగరేణి కార్మికుని 'సొంతింటి కల'ను సాకారం చేయకుండా, తాత్కాలిక నివాసాలైన క్వార్టర్లకే పరిమితం కావడం వెనుక ఆంతర్యం ఏమిటని కార్మిక లోకం ప్రశ్నిస్తోంది. ఒక్కో క్వార్టర్‌కు సుమారు రూ.44 లక్షలు వెచ్చించాలన్న నిర్ణయం.. సంస్థకు మేలు కంటే కాంట్రాక్టర్లకు, ప్రయివేటు వ్యక్తులకు లాభం చేకూర్చడమేనని, ఇది సింగరేణి ఆస్తులను పరోక్షంగా పరాయిపరం చేసే కుట్రే. ఈ నిర్ణయం సింగరేణి సంస్థకు, కార్మికుడికి ఏమాత్రమూ లాభదాయకం కాదని, పైగా దీర్ఘకాలంలో పెనునష్టాన్ని మిగులుస్తుందని చెబుతున్న క్షేత్రస్థాయి కార్మికుల మనోగతంపై పరిశీలనాత్మక కథనం.

అసలు వివాదం ఏంటి?

సింగరేణి యాజమాన్యం తాజాగా రూ.450 కోట్లతో 1100 చదరపు అడుగుల విస్తీర్ణంలో 1003 క్వార్టర్లను నిర్మించాలని నిర్ణయించింది. ఒక్కో నిర్మాణానికి సుమారు రూ.44 లక్షలు ఖర్చు చేయనుంది. ఈ ప్రతిపాదనే ఇప్పుడు వివాదానికి కేంద్ర బిందువుగా మారింది. 'అదే అపార్ట్‌మెంట్ తరహాలో బయట కడితే స్థలంతో కలిపి రూ.25 లక్షలకే పూర్తి చేయొచ్చు. ఇప్పటికే ఉన్న పాత క్వార్టర్లను కూల్చి, ఆ స్థలంలో నిర్మిస్తే రూ.22 లక్షలకే నిర్మాణం పూర్తవుతుంది. ఉన్న స్థలంలో నిర్మించే క్వార్టర్లపై అదనంగా పెట్టే ఖర్చు ఎవరి జేబుల్లోకి వెళుతుంది? అన్నది ప్రశ్న. ఈ భారీ వ్యయం వెనుక పారదర్శకత లోపం స్పష్టంగా కనిపిస్తోందని, ఇది కాంట్రాక్టర్లకు లబ్ది చేకూర్చేందుకేనని కార్మిక సంఘాల నాయకులు చెబుతున్నారు. ముఖ్యంగా గోదావరిఖని వంటి ప్రాంతంలో పదుల సంఖ్యలో శిథిలావస్థలో ఉన్న పాత క్వార్టర్లను కూల్చివేస్తే ఒక్కో క్వార్టర్ స్థలంలో 2వేల చదరపు అడుగుల స్థలం అందుబాటులోకి వస్తుంది. అక్కడ ఐదంతస్థుల అపార్ట్‌మెంట్ నిర్మించి, ఒక్కో కార్మికుడికి యాజమాన్య హక్కులతో (రిజిస్ట్రేషన్ చేసి) ఇస్తే, అంత ఖర్చు అవ్వదు కదా? అనే వాదనా వినిపిస్తోంది. అధికారిక లెక్కల ప్రకారం సింగరేణి వ్యాప్తంగా అన్ని రకాల క్వార్టర్లు కలిపి 50818 వరకు ఉన్నాయి. ఇందులో కార్మికులు నివసిస్తున్న క్వార్టర్లు 32 వేలు మాత్రమే. మిగతా 18818 వరకు క్వార్టర్లు అక్రమణకు గురవుతున్నాయి. ఇందులో శిథిలావస్థకు చేరుకున్నవీ ఉన్నాయి.

కల్లలు కానున్న సొంతింటి హామీ

ఉద్యోగం ఉన్నంత వరకు నివాసముండే ఈ క్వార్టర్ల కోసం కార్మికులు తమ జీతంలో హెచ్‌ఆర్‌ఏ, ఇతర అలవెన్సుల రూపంలో నెలకు సుమారు రూ.15,000 నుంచి రూ.18,000 వరకు నష్టపోవాల్సి వస్తోంది. ఉద్యోగ విరమణ తర్వాత ఈ క్వార్టర్లను ఖాళీ చేసి వెళ్లాల్సిందే. అప్పుడు వచ్చే రిటైర్మెంట్ డబ్బులతో స్థలం కొని, ఇల్లు కట్టుకోవడం తలకు మించిన భారంగా మారుతుంది. ప్రస్తుతం సింగరేణి కొత్తగా నిర్మించబోయే ఈ ఖరీదైన క్వార్టర్లలో భవిష్యత్‌లో ఉండేవారు ఎవరనే ప్రశ్నకు యాజమాన్యం బదులిస్తూ.. కొత్తగా వచ్చే కార్మికులకు ఇవ్వొచ్చనే వాదన వినిపిస్తోంది. అయితే ప్రస్తుతం సింగరేణిలో కొత్త నియామకాలు లేవు, ఉన్నవాళ్లు రిటైర్ అవుతున్నారు. ఈ క్వార్టర్లు ఎవరి కోసం కడుతున్నారు? రేపు ఇవి కూడా సింగరేణీయేతరుల పరం కావని గ్యారెంటీ ఏంటి? అన్నది కార్మికుల ప్రశ్న. బెల్లంపల్లి వంటి ప్రాంతాల్లో గనులు మూతపడ్డాక, పాత క్వార్టర్లు అన్యాక్రాంతమై, సింగరేణీయేతరుల చేతుల్లోకి వెళ్లిన అనుభవాలు కండ్ల ఎదుటే ఉన్నాయి. చాలా చోట్ల ఇదే పరిస్థితి ఉంది. ఇప్పుడు నిర్మించతలపెట్టిన ఈ ఖరీదైన క్వార్టర్లు కూడా భవిష్యత్‌లో ఆక్రమణకు గురై, సంస్థకు నష్టదాయకంగా మారే ప్రమాదం లేకపోలేదు.

కార్మికుడి వాదన – ప్రత్యామ్నాయ మార్గం

కంపెనీకి చెందిన ఖాళీ స్థలాల్లో లేదా శిథిలావస్థకు చేరిన పాత క్వార్టర్లను కూల్చేసి.. ఒక్కో కార్మికుడికి 250 గజాల స్థలానికి పట్టా ఇవ్వొచ్చు. ఆ పట్టాతో కార్మికుడు బ్యాంకు రుణం పొంది సొంత ఇంటిని తానే నిర్మించుకుంటాడు. దీనివల్ల సింగరేణి యాజమాన్యానికి రూపాయి కూడా ఖర్చు ఉండదు. క్వార్టర్లలో నివాసముంటే తాను కోల్పోతున్న హెచ్‌ఆర్‌ఏ, పెర్క్స్‌పై పన్ను మినహాయింపు వంటివి కార్మికుడికి తిరిగి లభిస్తాయి. పెర్క్స్‌పై ఆదాయ పన్ను ద్వారా రూ.5వేలు, ఇంటి కిరాయిపై ట్యాక్స్ మినహాయింపు రూ.3వేలు, ఇంటి కిరాయి ద్వారా రూ.7వేలు కలిపి మొత్తంగా రూ.15వేల వరకు బ్యాంకు ఈఎంఐ సులభంగా చెల్లించుకోవచ్చు. దీని వల్ల సర్వీసులో ఉండగానే కార్మికుడికి సొంతిల్లు మిగులుతుంది. వారు ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఇదే ప్రాంతంలో స్థిరపడతారు. దీనివల్ల మున్సిపాలిటీలకు పన్నుల రూపంలో స్థిరమైన ఆదాయం వస్తుంది. కోల్ బెల్ట్ ప్రాంతం ఆర్థికంగా మరింత బలోపేతం అవుతుంది.

ఇది యాజమాన్యం కుట్రే !

తుమ్మల రాజిరెడ్డి, సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు

కొత్త క్వార్టర్ల నిర్మాణం పేరుతో యాజమాన్యం కార్మికులను మభ్యపెడుతోంది. ఇది కేవలం కాంట్రాక్టర్లకు, ప్రయివేటు వ్యక్తులకు లబ్ది చేకూర్చేందుకే. రూ.44 లక్షల అంచనా వ్యయం పూర్తిగా ఏమాత్రమూ సహేతుకం కాదు. ఈ కుట్రను కార్మికులంతా ఐక్యంగా వ్యతిరేకించాలి. అపార్ట్‌మెంట్ రూపంలో నిర్మిస్తే సగం ధరకే పూర్తవుతుంది. యాజమాన్యం చేయాల్సిందల్లా.. శిథిలమైన క్వార్టర్లను కూల్చి ఆ స్థలాన్ని కార్మికుల పేరు మీద పట్టా చేసి, వడ్డీ లేని రుణ సౌకర్యం కల్పించడమే. దీనివల్ల కంపెనీకి ఒక్క రూపాయి ఖర్చుండదు. కార్మికుడి సొంతింటి కల నెరవేరుతుంది.

మాట నిలుపుకోవాలి

కొల్లూరి బాలయ్య, వన్ ఇన్‌క్లయిన్ హాలోర్ ఆపరేటర్

భూగర్భ బొగ్గు గనిలో ప్రాణాలను ఫణంగా పెట్టి పనిచేసే మాకు సొంతిల్లు కట్టిస్తామని గత ప్రభుత్వం చెప్పింది. ప్రస్తుత ప్రభుత్వం కూడా అదే హామీ ఇచ్చింది. ఎన్నికలొచ్చినప్పుడం నాయకులు, కార్మిక సంఘాల నేతలు ఇదే మాట చెబుతారు. ఇప్పుడు చూస్తే.. యాజమాన్యం ఇచ్చేది శాశ్వత హక్కు లేని క్వార్టర్లు మాత్రమే. శాశ్వతంగా 250 గజాల స్థలం ఇవ్వండి. మేమే ఇల్లు కట్టుకుంటాం.